

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంచిక : 5 సంపుటి : 10 పుష్యం : 39-42 5-7-2000

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 24

**VOL: 5 ISSUE: 10**

CHIEF EDITOR
**P. S. RAMA RAJU**

EDITOR
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 125

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438

## మత హింసలు మనకొద్దు

అజ్ఞాన తిమిరంలో ఉన్న మానవజాతి జ్ఞానోదయం కల్గించాలని ఒకో ప్రవక్త ఒకోవిధంగా చెప్పిన విధానాన్ని మతంగా చెప్పుకొంటున్నాము. క్రైస్తవులకు బైబిల్, ఇస్లాం మతస్థులకు ఖురాన్, హిందువులకు భగవద్గీత లేదా వేదాలు అన్నీ మానవ వికాసానికి ఉపయోగపడే గ్రంధాలు. వాటి ఆధారంగా సభ్య సమాజంలో శాంతిని, సహజీవనాన్ని పొందుతూ ముక్తిమార్గాన్ని అన్వేషించే సాధనాలు. యిటీవల దేవాలయముల ధ్వంసం చేసే దుష్ట సాంప్రదాయానికి బీజం ఏర్పడింది. యిది ఏ మతస్థులు ప్రోత్సహించని దుశ్చర్యలు, చర్చిల్లోగాని, మసీదుల్లోగాని, దేవాలయాలలోగాని బాంబులు పెట్టినా, మరే విఛ్ఛిన్నకర పద్ధతులు అవలంభించినా ఆయా మతాల్లోని సారాశం ప్రకారం ఎవరూ హర్షించరు. కొందరు దుండగులు చేస్తున్న దుశ్చర్యలు మత ఘర్షణలకు దారి తీయకుండా తప్పు చేస్తున్న వారిని అందరూ కలిసి గుర్తించే ప్రయత్నంవల్ల తిరిగి ఈ సాహసానికి పూనుకోవడానికి జంకుతారు. చెడ్డపనులు చేయటం ద్వారా భగవంతుని ఆగ్రహానికి గురికాగలరని గుర్తించాలి.

.... ఛీఫ్ ఎడిటర్

### ఈ సంచికలో....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

30-4-2000, పాలకొల్లు ........ 2
12-5-2000, ధర్భరేవు ........ 8
12-6-2000, భీమవరం ........ 13
18-6-2000, ఆకివీడు ........ 20

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, పాలకొల్లు, 30-4-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు చదువు ఉండవచ్చు, ధనం ఉండవచ్చు. వాటిని సద్వినియోగం చేసుకొంటే పుణ్యాన్ని తీసుకొని వస్తాయి, దుర్వినియోగం చేసుకొంటే పాపాన్ని తీసుకొని వస్తాయి. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే చదువు సరిపోదు, ధనం సరిపోదు, సహనం ఉండాలి. సహనం ఆధ్యాత్మిక జీవితానికి పునాది వంటిది. మనకు ఆత్మజ్ఞానం లేదు, విషయజ్ఞానం ఉంది. విషయజ్ఞానం కూడా అజ్ఞానములో భాగమే. విషయజ్ఞానం వలన అజ్ఞానం నశించదు, ఆత్మజ్ఞానం వలన అజ్ఞానం నశిస్తుంది. మనకు మూడు అవస్థలు తెలుసు. గాఢనిద్ర, స్వప్నావస్థ, జాగ్రదవస్థ మనకు తెలుసు. ఈ మూడు అవస్థలు అజ్ఞానమే. ఈ మూడు అవస్థలకు ఆధారంగా ఒక అవస్థ ఉంది. దానినే తురీయం అంటారు. దానిని తెలుసుకోవటమే జ్ఞానం. పూర్వం మనకు ఇటువంటి దేహాలు అనేకం అయిపోయాయి. ఆ దేహాలు కాలి బూడిద అయిపోయాయి. అవి మనకు జ్ఞాపకం లేవు. అయితే ఆ దేహాలలో చేసిన పనులు సంస్కారములుగా, వాసనలుగా లోపల పడి ఉన్నాయి. వాటిని తొలగించుకోవటానికే సాధన. మీరు ఎవరు అంటే కులం పేరు, మతం పేరు చెపుతారు. ఇవి అన్నీ మనస్సు కల్పించినవే. నీ లోపల ఉన్న సద్వస్తువు ఒక కులం కాదు, ఒక మతం కాదు, ఒక ప్రాంతానికి సంబంధించినది కాదు. అది చావు లేనిది, స్వతంత్రమైనది. అది శాంతిగా ఉంటుంది, జ్ఞానంగా ఉంటుంది, అనంతంగా ఉంటుంది. దానిని ఎరుకలోనికి తెచ్చుకోవటానికి ఈ శరీరాన్ని, మనస్సును ఉపయోగించుకో ఇది వేదం యొక్క ఆదేశం. సంసారంలో ఏదో కష్టాలు వస్తూనే ఉంటాయి, వాటిని భరించాలి. వాటిని భరించే శక్తి నేర్చుకొంటే నీ హృదయం యొక్క లోతులు పెరుగుతాయి.

ఇప్పుడు మనకు శరీరం కనిపిస్తోంది. కాని భగవాన్ ఏమంటారు అంటే ఈ శరీరం ఇప్పుడు కూడా లేదు అంటారు. శరీరం ఇప్పుడు మనకు కనిపిస్తోంది కదా శరీరం ఇప్పుడు కూడా లేదు అంటే ఎలా కుదురుతుంది. దానికి ఆయన ఏమి చెపుతున్నారు అంటే ఒక కాలంలో ఉండి ఇంకో కాలంలో లేనిది ఎప్పుడూ లేనట్లే అని చెపుతారు. ఈ శరీరం ఇప్పుడు ఉంది, ఇంకా కొంత కాలం తరువాత ఇది ఉండదు. అందువలన ఇది ఇప్పుడు

కూడా లేనట్లే అని చెపుతారు. మన శరీరం ఉన్నా లేకపోయినా, ఈలోకం కనిపించినా కనిపించకపోయినా ఎప్పడూ ఉండే వస్తువు ఒకటి ఉంది. దానిని తెలుసుకోవటానికి మూడు అవసరం అని చెపుతారు. 1. ఆహార నియమం, 2. ఏకాంత వాసం 3. బ్రహ్మ విచారణ. ఆహారందగ్గర జాగ్రత్తగా ఉండాలి. మనం తినే ఆహారంలో స్థూలరూపం మలంగా మారుతుంది. మధ్యరూపం మాంసంగా మారుతుంది. సూక్ష్మరూపం మనస్సుగా మారుతుంది. శరీరాన్ని ఎక్కడ కోసినా మాంసమే. ఈ మాంసమయ శరీరాన్ని మంత్రజపం చేసి, ధ్యానం చేసి మంత్రమయం చేసుకో, ధ్యాన మయం చేసుకో. అప్పడు వస్తువు నీకు ఎరుక లోనికి వస్తుంది అని భగవంతుడు చెపుతున్నాడు. సాధన మనస్సుతో చేస్తావు. మనస్సు తినేఆహారం నుండి వస్తుంది. అందుచేత ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు. ఆహారం తినేటప్పడు నిశ్చలమనస్సుతో ఉండు, ఆకలికి సరిపడ తిను అంతేగాని రుచికోసం అధికంగా తినవద్దు. నియమములు అనేకం ఉన్నాయి అన్నింటికంటే ఆహారనియమము ఉత్తమమైనది అని భగవాన్ చెప్పారు. పదిమందిలో ఉన్నప్పడు మనస్సులో ఏమి ఉందో మనకుతెలియదు. ఇంటిలో ఏకాంతంగా ఉన్నప్పడు మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తుంది. స్కానింగ్ తీసినప్పడు మీ శరీరంలో ఉన్న రోగములు ఎలా తెలుస్తాయో, అలాగే ఏకాంతవాసంలో ఉన్నప్పడు మీ మనస్సులో ఉన్న దోషములు మీకు తెలుస్తాయి. శరీరాన్ని గదిలో కూర్చోబెట్టి మనస్సును ఎక్కడో తిప్పటం ఏకాంతవాసం కాదు. ఎక్కడ తలంపులు లేవో అది ఏకాంతవాసం అని మళయాళ స్వామివారు చెప్పారు. ఆ స్థితికి మనం ఇప్పడే వెళ్ళలేక పోవచ్చు కాని మనం ఏకాంతంగా కూర్చొంటే మనలోని బలహీనతలు మనకు తెలుస్తాయి.

నీలోపల బ్రహ్మం ఉంది. అది నీకు తెలియటంలేదు. నీకు తెలియనంత మాత్రం చేత అది లేకపోవటం అంటూ లేదు. కేవలం ఆసనాలు వేసినంత మాత్రం చేత అది తెలియబడదు. అది సత్యం. అది అనంతం. అది ఎవరికి తెలుస్తుంది అంటే ధర్మాన్ని ఎవరైతే ఆచరిస్తున్నారో వారికి తెలుస్తుంది. నీవు ఆ వస్తువు దగ్గరకు వెళితే భయం ఉండదు. మనస్సుతో ఉంటే ఏ నిమిషానికి ఆ నిమిషం ఏదోరకమైన భయం వెంటాడుతూ ఉంటుంది. హృదయంలోనికి వెళితే అభయస్థితి కలుగుతుంది.

భక్తి అంటే చాలా తేలిక అనుకొంటారు. ఎంతో కష్టపడ్డవారికి, పూర్వ పుణ్యం ఉన్న వారికి భక్తి కలుగుతుంది. లేకపోతే భక్తి కలుగదు. వారికి ఉన్న భక్తి మనకు కనబడుతుంది

గాని దాని వెనకాల ఎంత కష్టం ఉందో మనకు తెలియదు. భక్తి అంటే సామాన్యం కాదు ఎంతో పూర్వ పుణ్యం ఉంటే గాని భక్తి రాదు. భక్తి అనే పులి మీదగ్గర ఉంటే ఇంక మేకలు, గొర్రెలు రావు అంటే విషయాలు మీ దగ్గరకు రావు, మిమ్మల్ని భాధించవు. నీ హృదయంలో ఉన్న వస్తువు ఎంత నిర్మలమైనదో, ఎంత పవిత్రమైనదో నీ మనస్సు కూడ అంత నిర్మలమైతే, అంత పవిత్రమైతే నీ మనస్సు వెళ్ళి అందులో లీనమౌతుంది. హృదయంలోనికి వెళ్ళి నీ మనస్సు కరిగిపోయేటంత భక్తి నీకు ఉండాలి. జ్ఞానం కావాలి, జ్ఞానం కావాలి అంటే జ్ఞానం రాదు. ఉపాసన ఉండాలి, దానికి సంబంధించిన పునాది ఉండాలి, దాని కోసం నీవు తపించాలి. ఉపాసన చేయటానికి అనేక కేంద్రములు ఉన్నాయి. హృదయంలో నీ మనస్సును నిలబెట్టి ధ్యానం చేస్తూ ఉంటే అది ఉత్కృష్టమైన ఉపాసన. ఆత్మ సాక్షాత్కారం పొందటానికి రెండు ముఖ్యమైన మార్గములు ఉన్నాయి. శరణాగతి మార్గం, విచారణామార్గం. భగవంతుడు చెప్పినట్లు మనం నడచుకోవాలి అని అనుకోవటం లేదు, మనం చెప్పినట్లు ఆయనవినాలి అనుకొంటున్నాము అది శరణాగతిమార్గం కాదు. ఆయన ఆజ్ఞననుసరించి జీవిస్తే అది శరణాగతి మార్గం. ఈ మధ్య ఒక రమణ భక్తుడు చెప్పాడు. నాకు భక్తి ఉంది నా భార్యకు భక్తి లేదు అని నేను అనుకొనేవాడిని కాని నాకే భక్తి లేదు ఆవిడకు భక్తి ఉంది అని నాకు ఎప్పుడు తెలిసింది అంటే 15 సంవత్సరములకు పూర్వం మా కోడలు యాక్సిడెంట్‌లో చనిపోయింది. ఏమిటి కోడలు ఇలా చనిపోయింది అని రమణమహర్షిమీద నాకు భక్తి పూర్తిగా పోయింది. కోడలు మరణవార్త విన్నప్పుడు నాలో రియక్షన్ వచ్చింది. కాని నా భార్య ఆ వార్త వినక ముందు ఎలా ఉందో విన్న తరువాత కూడా అలానే ఉంది. ఆవిడలో ఏమీ రియాక్షన్‌రాలేదు. నా భక్తి అల్లరి భక్తి, ఆవిడ భక్తి నిదానమైన భక్తి అని అప్పుడు నాకు తెలిసింది. ఈశ్వరసంకల్పాన్ని మనం గౌరవించాలి కదా అని చెప్పింది. ఆవిడ బేలెన్స్ తప్పకుండా భక్తిగా ఉండటంవలన ఆవిడను చూసి నేను మరలభక్తి నేర్చుకొన్నాను. కళ్ళతో చూసి వాడికి భక్తి ఉంది, వీడికి లేదు అని చెప్పలేము. పరీక్షాసమయం వచ్చినప్పుడు అది తెలుస్తుంది. పరీక్షల ద్వారా మీ చైతన్య స్థాయిని పెంచుతాడు అందువలన పరీక్షలు వస్తే కంగారుపడకండి అవి మీ మంచి కోసమే పంపుతాడు.

ప్రపంచంలో ఏ వస్తువును మనం శాంతితో పోల్చలేము. అట్టిది శాంతి. అదే ఆత్మ. కొంతమందికి బాహ్యంగా అన్నీ ఉంటాయి. శాంతి ఉండదు., కొంతమందికి బాహ్యంగా ఏమీ లేకపోయినా శాంతిగా ఉంటారు. వారు చక్రవర్తులలాగ జీవిస్తారు.



5-7-2000

కర్పూరం కాలిపోయిన తరువాత ఏమీ మిగలదు. మనస్సు కూడా కర్పూరం వంటిదే. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే కర్పూరం కాలిపోయినట్లుగా మనస్సు కూడా పూర్తిగా కాలిపోతుంది. ఇంక ఏమీ మిగలదు. మనస్సుపోతే నీవు పోతావు అనుకోవద్దు మనస్సు పోతే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. మనస్సే నేను అని నీవు అనుకొంటున్నావు. మరి గాఢనిద్రలో నీకు మనస్సు ఉందా? అక్కడ మనస్సు లేదు. మనస్సు లేకుండా గాఢ నిద్రలో నీవు ఉన్నావు కదా. అది ఎవరు? అదే ఆత్మ, అదే బ్రహ్మం. నేను మూర్తి ధ్యానం చేసుకొంటున్నాను. ఇది జ్ఞానం పొందటానికి ఉపయోగపడుతుందా అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. తప్పకుండా ఉపయోగ పడుతుంది అని చెప్పారు. ధ్యానం చేయగా చేయగా మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. నామ జపం వలన కూడా మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. పశువును కట్రాడుకు కట్టేస్తే ఎలా పడి ఉంటుందో అలాగే మనస్సును ఒక నామంతోగాని, ఒక రూపంతో గాని కట్టేస్తే స్థిరంగా పడి ఉంటుంది, మనస్సుకు చాపల్యం తగ్గుతుంది. ఒక నామాన్ని కాని, రూపాన్ని గాని స్థిరంగా పట్టుకొని ఉంటే ఇతర భావాలు రావు. మన జీవితంలో వ్యవహారం అంతా తలంపులను బట్టి ఉంటుంది, ఆ తలంపుల విషయంలో మనం జాగ్రత్తగా ఉండటంలేదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి లేకపోవటానికి కారణం ఇదే. మనం శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత మనస్సుకు ఇవ్వటంలేదు. దేహగతమైన జీవితం స్మశానంతో ఆగిపోతుంది, మనోగతమైన జీవితం పునర్జన్మకు కారణం అవుతుంది. అహంభావన ఉన్నప్పుడు ఒక నామాన్ని జపించటం గాని, ఒక రూపాన్ని ధ్యానించటం గాని చేసుకోవచ్చు. అహంభావన దాటి వెళ్ళినప్పుడు నీకు నామంతోగాని, రూపంతో గాని పనేలేదు.

నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో కలసి ఉంటేనీకు ఏమీ అక్కరలేదు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువుతో ఏకంగా ఉండలేకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. చాలామంది ఏదైనా కష్టం వస్తే దేవుడిని తిడతారు. మనకు పూర్వజన్మలో ఉన్న దోషమే కష్టరూపంలో వస్తుంది. మనకు ఏదైనా మంచి జరుగుతోంది అనుకోండి పూర్వజన్మలో ఉన్న పుణ్యమే మంచిగా వస్తుంది. దీనికి దేవుడికి ఏమీ సంబంధం లేదు. నీవు పూర్వజన్మలో చేసిన దానికి ఫలితాన్ని ఇస్తున్నాడు. నీవు చేసినదే నీకు ఇస్తాడు. నీవు చేసినదే నీకు ఎదురు వస్తుందిగాని నీవు చేయనది నీకు రాదు. చీకటి పోవాలి, చీకటి పోవాలి అంటే చీకటి పోతుందా, పోదు. ఎప్పటి వరకు ఉంటుంది అంటే సూర్యుడు ఉదయించే వరకు చీకటి అలాగే ఉంటుంది. అలాగే ఈ చావులు,

పుట్టుకలు రాకూడదు, మరణంలేనిస్థితికి ఎదిగివెళ్లాలి అంటే నీవు వెళ్లలేవు. ఎప్పటి వరకు వెళ్లలేవు అంటే లోపల ఉన్న జ్ఞానం నీకు అనుభవంలోనికి వచ్చే వరకు నీవు మరణం లేని స్థితికి వెళ్లలేవు. బయట ఉన్న చీకటి సూర్యుడు ఉదయిస్తేనే గాని పోదు అలాగే లోపల ఉన్న అజ్ఞానం ఆత్మజ్ఞానం కలిగేవరకూ అది నశించదు. దేహబుద్ధి నశిచిన తరువాత గాని లోపల ఉన్న ఆత్మవస్తువు నీకు వ్యక్తం కాదు. పని చేస్తే ఈ ప్రపంచం అంతా నాది అనుకొని పనిచెయ్యి లేకపోతే ఈ ప్రపంచంలో ఏదీ నాది కాదు అనికొని పనిచెయ్యి. ప్రపంచం అంతా నాది అనుకొని పనిచేయటం కర్మయోగం. ఏదీ నాది కాదు అనుకొని పనిచేయటం జ్ఞానయోగం. ఈ రెండు మార్గాలలో ఏ మార్గం ద్వారా ప్రయాణం చేసినా నీకు మోక్షం కలుగుతుంది. కొంతమంది మనలను పొగుడుతూ ఉంటారు. కొంతమంది మనలను విమర్శిస్తూ ఉంటారు. సమాజంలో ఇవి రెండూ సహజంగా జరుగుతూ ఉంటాయి. పొగిడినప్పడు పొంగిపోయి, విమర్శించినప్పడు కృంగిపోతున్నాము అనుకోండి ఇంక మనకు ఆత్మజ్ఞానం కలుగదు. నింద, స్తుతి ఈ రెండింటిని దాటి వెళితే గాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. భక్తి అంటే కేవలం ఉదయం పూజచేసుకోవటమే కాదు. నిందకు స్తుతికి తట్టుకొని నీ మనస్సును సమానంగా ఉంచుకోవటం కూడా భక్తే. నిందకు, స్తుతికి నీ మనస్సు వ్యాకులత చెందుతూ ఉంటే నీకు భక్తి లేదు అని అర్థం. ఏది నిజమైన భక్తి అంటే భగవంతుని యందు ప్రేమ ఉండాలి, భగవంతునితో అనుబంధం ఉండాలి. అది కోరికకు పరిమితం అవ్వకూడదు. మనం ఏదైనా కోరిక పెట్టుకొని దేవుని ప్రార్థిస్తున్నాము అనుకోండి నిజంగా మనం దేవుని ప్రార్థించము, కోరికనే ప్రార్థిస్తాము. దేవుని ధ్యానం చేయుము, కోరికనే ధ్యానం చేస్తాము. మనం దేవుని ధ్యానం చేస్తున్నాము అని అనుకొంటాము గాని మన కోరికనే మనం ధ్యానం చేస్తాము.

దేహం ఏ ప్రారబ్దం అనుభవించటానికి వచ్చిందో ఆ ప్రారబ్దం ప్రకారం దేహయాత్ర జరుగుతూ ఉంటుంది. మన ఇష్ట ప్రకారం మనం ప్రవర్తించలేము. దేహ ప్రారబ్దంలో ఉన్నది నీకు కోరిక లేకపోయినా అది జరిగిపోతుంది. ప్రారబ్దంలో లేనప్పడు నీకు కోరిక ఉన్నా అది జరుగదు. కర్త అనేవాడు లేకపోతే నీవు అనుకొన్నవి అన్నీ జరిగిపోవాలి. మనం అనుకొన్నవి అన్నీ జరగటం లేదు. కొన్ని జరుగుతున్నాయి. కొన్ని జరగటంలేదు దీనికి కారణం ఏమిటి అంటే నీ దేహప్రారబ్దంలో ఉంటేనీవు కోరుకోకుండానే అది జరుగుతుంది. ప్రారబ్దంలో లేకపోతే నీవు కోరుకొన్నా అది జరగనే జరుగదు. అందువలన దేహాన్ని

ప్రారబ్దానికి విడిచిపెట్టు. అయితే నీవు చేయవలసిన సాధన ఏమిటి అంటే దానితో తాదాప్యం చెందకు. దేహం ద్వారా మంచో, చెడ్డో జరుగుతూఉంటుంది. దేహానికి మరణం రావలసినప్పుడు అది వస్తుంది. ఆ దేహం ద్వారా ఏమి జరగాలో ఈశ్వర నిర్ణయం ప్రకారం అది జరుగుతుంది. నీవు దేహంతో తాదాప్యం చెందకు. ఎప్పుడైతే దేహంతో నీకు తాదాప్యం లేదో అప్పుడు దుఃఖం నశిస్తుంది. నీ దేహం ఏ పని మీద అయితే వచ్చిందోఅది నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అది జరుగుతుంది కాబట్టి ఇష్టంతో చెయ్యి. కొంతమంది ఇంటిదగ్గర ముసలి వారిని చూసేటప్పుడు కాఫీ ఇస్తారు, అన్నం పెడతారు గాని మూలుక్కొంటూ ఉంటారు. అలా చెయ్యవద్దు, ఇష్టంగా చెయ్యి ఎందుచేతనంటే నీ దేహప్రారబ్దంలో ఆ డ్యూటీ నీవు చెయ్యవలసి ఉంది. నీవు ఆ పని ఎలాగూ చెయ్యాలి కాబట్టి ఇష్టంతో చెయ్యి. ఇష్టంగా చేస్తే కొత్త వాసనలు రావు, పాత వాసనలు నశిస్తాయి. దైనందిన జీవితంలో నీవుచేసే పనే ఇష్టంగా, ప్రేమగా, భక్తిగా, శ్రద్ధగా చేస్తూ ఉంటే ప్రారబ్దం నశిస్తుంది, దేహాభిమానం నశిస్తుంది, నిష్కామకర్మ ద్వారా నీవు తరిస్తావు. నీ కంటిని క్రిందకు త్రిప్పితే భూమి కనిపిస్తుంది, పైకి త్రిప్పితే ఆకాశం కనిపిస్తుంది. అలాగే నీ అంతఃకరణాన్ని భగవంతుని వైపుకు త్రిప్ప నీకు భగవదనుభవం కలుగుతుంది. నీవు హృదయం వైపుకు త్రిప్పటం లేదు, ప్రకృతి వైపుకు త్రిప్పతున్నావు అందువలన ప్రకృతి ఒక్కటే నిజం అని నీకు అనిపిస్తుంది. అప్పుడు ప్రకృతి నిన్ను వెంటాడుతుంది, నిన్ను పీడిస్తుంది.

నాకు లెక్కలు రావు అని కూర్చుంటే నీకు లెక్కలు వచ్చేయవు. లెక్కలు చెప్పే టీచర్ దగ్గరకు వెళ్ళి లెక్కలు చెప్పించుకో. అలాగే నాకు జ్ఞానం గురించి తెలియదు అని కూర్చోవద్దు. మహాత్ములను ఆశ్రయించి, జ్ఞానులను ఆశ్రయించి వారి అనుగ్రహాన్ని పొంది వారి దగ్గర ఆత్మజ్ఞానం శ్రవణం చేసి, అర్థం చేసుకొని, ఆచరిస్తే నీవు కూడా జ్ఞానివి అవుతావు. ఈ సృష్టికి ఎవడైతే కర్తో వాడి మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచితే నీ మనస్సు అణిగిపోతుంది, జరగవలసినది జరిగిపోతుంది. మధ్యలో నీ మనస్సును అడ్డురానియ్యకు, ఈ సైతానును ఒక ప్రక్కన పెట్టు. భగవంతుని పట్ల భక్తి కలిగి ఉంటే అక్కరలేని విషయాలు నిన్ను బాధపెట్టవు. నీవు ఎవడినైతే స్మరిస్తున్నావో వాడే అక్కరలేని తలంపులను మాయ చేస్తాడు. మన భారం అంతా భగవంతుని మీద వేసి, మన డ్యూటీ మనం చేయాలి. ఈ దేహంతో, మనస్సుతో ఏది చేసినా ఆయనకే సమర్పించు. నీ వాక్కు నిర్మలంగా ఉండాలి, నీ మనస్సు నిర్మలంగా ఉండాలి. నీ మనస్సు కంట్రోలులో ఉంది

అనుకోండి, శాంతిగా ఉంది అనుకోండి, రాగద్వేషములు నీ మనస్సును అల్లరి చేయటం లేదు అనుకోండి ప్రాణాయామం మీరు ప్రత్యేకంగా చేయనక్కరలేదు, దాని అంతట అదే జరిగిపోతూ ఉంటుంది. గాఢ నిద్రలో మనం ఏదైతే కాదోఅందులోనుండి వేరుపడుతున్నాము. జాగ్రదవస్థలోనికి వచ్చాక గొడవలు అన్నీ వస్తున్నాయి. మనం ఏదైతే కాదో వాటిని ఒకోదానిని ఇది మనం కాదు, ఇది మనం కాదు అనిగెంటుకొంటూ వస్తే గాఢనిద్రలో ఏ స్థితి అయితే ఉందో ఆ స్థితిని జాగ్రదవస్థలో అనుభవిస్తాము, అదే మోక్షం. నా అహంకారము పోగొట్టుకోవటం ఎలాగ అని చాడ్విక్‌గారు భగవాన్‌ను అడిగారట. నీకు అహంకారం ఉందో లేదో చూసుకో. నీకు అహంకారం నిజంగా లేదు, ఉంది అని నీవు అనుకొంటున్నావు. లేదు అన్న విషయం తెలుసుకో సరిపోతుంది అని భగవాన్ చెప్పారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు 12-5-2000, దర్భరేవు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవంతుడు వేరు, జ్ఞాని వేరు కాదు. భగవంతుడి స్వరూపాన్ని పొందినవాడినే జ్ఞానిఅని పిలుస్తారు. బ్రహ్మం గురించి చెప్పాలంటే ఆ స్థితిని పొందినవాడు చెపితే అది సరళంగా, సరసంగా ఉంటుంది, వినేవారి హృదయానికి హత్తుకొంటుంది. అందరి హృదయాలలో సద్వస్తువు ఉంది, జ్ఞానిలో ఉంది, అజ్ఞానిలో కూడా ఉంది. ఎవడి హృదయం అయితే పవిత్రం అయ్యిందో, పరిశుద్ధం అయ్యిందో వాడిలో ఆత్మజ్యోతి వ్యక్తమవుతుంది. హృదయం పరిశుద్ధం కాకపోతే అది లోపల ఉన్నా అది మనకు వ్యక్తం కాదు. అది తెలియని వాడిని దుఃఖం వెంటాడుతుంది, దానిని తెలుసుకొన్నవాడు సుఖి అవుతాడు. ఆ వస్తువు యొక్క స్వరూపమే ఆనందం. ఆ స్వరూపాన్ని విడిచి పెట్టి సుఖాన్వేషణ కోసం మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చే అవకాశం లేదు. గురువు యందు గౌరవం ఉండాలి, భక్తి ఉండాలి, గురువు పట్ల అద్వైతభావన పనికి రాదు. గురువు పట్ల అద్వైత భావన ఉంటే వాడికి ఉపదేశం పొందే అర్హత ఉండదు కదా అని భగవాన్‌ను అడుగుతున్నారు. దానికి భగవాన్ అవును అని చెపుతూ కాని గురువు ఉండేది అంతరంగంలో. నిజమైన గురువు ఎక్కడ ఉన్నాడు మన హృదయంలో ఉన్నాడు. గురువు అంటే ఆత్మ, చైతన్యం. గురువు ఎంతలోతులలో ఉన్నాడో అంత లోతులలోనికి వెళ్ళటానికి మనకు శక్తి సరిపోవటం లేదు. గురువు చెప్పిన మాటలు శ్రవణం చేయాలి. మాటల పట్ల నీకు శ్రద్ధ ఉండాలి దానికి సజీవమైన విశ్వాసం అవసరం. గురువు చెప్పిన

మాటలు శ్రద్ధగా శ్రవణం చేసి, మననం చేసి వాటిని అర్థం చేసుకొని ఆచరించగలిగితే మన హృదయంలో ఉన్న జ్ఞానగంగ మనకు అందుతుంది. నీకు దేహబుద్ధి ఉంది కాబట్టి గురువును కూడా దేహమాత్రుడుగా చూస్తావు అందువలన గురువు బయట ఉన్నాడని నీకు అనిపిస్తుంది.

గురుదేవా సదా నా అంతరంగంలో స్థిరుడవై ఉండి మానుష రూపం ధరించి నన్ను నడుపుతూ, నన్ను రక్షిస్తున్నావు. నీకు ఆ శరీరం అవసరం ఉండి కాదు మమ్మల్ని చక్క బెట్టటానికి, మా మనస్సును పవిత్రం చేయటానికి, మాకు మోక్షానికి దారి చూపించటానికి నువ్వు దేహం ధరిస్తున్నావు. మాకు బోధ చేయటం కోసం ఆ శరీరం ధరించి వస్తున్నావు. బోధ ద్వారా మా మనస్సును సంస్కరించి పొరపాటు మార్గంలో నడుస్తుంటే మమ్మల్ని సరిచేస్తున్నావు, మమ్మల్ని రక్షిస్తున్నావు. మేఘాలు సూర్యుడు మనకు కనబడకుండా చేస్తున్నాయి. ఆ మేఘాలు పోతే సూర్యుడు కనబడతాడు. మన హృదయంలో సద్వస్తువు ఉన్నప్పటికి అది మనకు తెలియకుండా ఈ దేహగతమైన నేను మనకు అడ్డువస్తోంది. భగవంతుని నామాన్ని నిరంతరం జపించటం వలన గాలి ఏ విధంగా మేఘాలను గెంటివేస్తోందో అలాగ నామం దేహగతమైన నేనును గెంటివేస్తుంది అప్పుడు హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు తెలియబడుతుంది. అత్యంత సులభం ఆత్మవిద్య అని భగవాన్ చెప్పారు, అదే కష్టము అని వేదాలు చెపుతున్నాయి. అది అత్యంత సులభం అయితే లోకంలో జ్ఞానులు బహుతక్కువమంది ఉన్నారు కదా అని అడిగితే మీరు అహంభావనకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు. అదే మీరు అనుకొని ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు. దానికి ప్రాముఖ్యత ఇవ్వకుండా ఉంటే అదే పడిపోతుంది అప్పుడు లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తుంది. విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ధ్యానం చేసేది అహంభావనే, జపం చేసేది అహంభావనే. అహంభావన లేని వాడికి సాధన ఏమిటి. అహంభావన నువ్వు అనుకొన్నా అది నువ్వు కాదు. అందుచేత గాఢనిద్రలో దానిలోనుండి విడిపోతున్నావు. నువ్వు ఏదైతే అవునో దానిలోనుండి నీవు సెపరేట్ అవ్వలేవు. అది నీవు కాదుకాబట్టి గాఢనిద్రలో అహంభావన నుండి విడిపోతున్నావు. ఆ క్లూ మీకు అర్థమయితే చాలు. అది మీకు అర్థం కాక దానికి జీవితం పొడుగునా ప్రాముఖ్యత ఇస్తున్నారు. దానికి ప్రాముఖ్యత ఇవ్వకండి, దానికి ఫుడ్ సప్లయి కట్ అయ్యి అది నశిస్తుంది.

మాయ ఎక్కడ ఉంది అంటే వర్తమాన కాలాన్ని అందరూ వదిలివేస్తున్నారు. భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నారు, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటున్నారు. ప్రతీవాడు

అడగకుండా ఉండలేకపోతున్నాను. బాహ్యంగా నాకు ఏమీ లోటులేదు. డబ్బు ఉంది, తెలివి ఉంది. ఇవి అన్నీ ఉన్నా నేను శాంతిగా ఉన్నాను, నాలో వెలితి లేదు అని చెప్పటానికి మీ దగ్గర నాకు నోరు రావటంలేదు. నేను శాంతిగా లేకుండా శాంతిగా ఉన్నాను అని చెపుతాను అనుకోండి నన్ను నేను మోసం చేసుకొన్నట్లు అవుతుంది. హృదయంలో శాంతి ఉంది. అక్కడకు వెళితేనే గాని శాంతి దొరకదు అని మీరుచెపుతున్నారు. బహుశా నేను ఇంకా హృదయంలోనికి వెళ్ళలేదేమో? అందువలన శాంతి నాకు దొరకటంలేదు. హృదయంలో శాంతి ఉంది, మనస్సును తీసుకొని వెళ్ళి హృదయానికి స్వాధీనం చేయమని మీరు చెపుతున్నారు. మనస్సులో స్వార్థం ఉంటే హృదయానికి స్వాధీనం అవ్వదు అని చెపుతున్నారు. మేము పూర్తిగా స్వార్థం విడిచిపెట్టాము అని చెప్పలేను అలాగని స్వార్థపరులము అని చెప్పలేము. అటు ఇటు కాకుండా ఉన్నాము. మేము ఆడవాళ్ళము పెద్ద పెద్ద సాధనలు చేయలేము, ఏదోసామాన్యంగా చేయగలము. నాలో అశాంతి పోవాలంటే ఈ దొంగనేను పోతేగాని అశాంతి పోదు అని మీరు చెపుతున్నారు. ఈ దొంగనేను మీ అనుగ్రహం వలన పోతుందిగాని నా తెలివితేటల వలన పోదు. అందువలన మీరు నా పట్ల దయచూపించి ఈ అశాంతిని పోగొట్టాలి. మా మిథ్యానేను మీరు కాదు. మాలో ఉన్న నిజమైన నేనే మీరు మాలోపల మీరు ఉన్నారు కాబట్టి మా అశాంతిని పోగొట్టగల సమర్థులు మీరు. అందువలన మా అశాంతిని పోగొడతారని ఆశించి ఇక్కడకు వచ్చాను. అందువలన మీరు నన్ను ఆశీర్వదించండి అని సంపన్నురాలు భగవాన్‌ను అడుగుతున్నారు. మీ ఆశీస్సులు అందిస్తే గాని నాలోని అశాంతి పోదు. అయితే మీ ఆశీస్సులు అందుకోవడానికి తగిన అర్హత ఉంది అని నేనుచెప్పలేను. నీకు అర్హతలేదు, యోగ్యతలేదు అని మీరు అనవద్దు. అర్హత, యోగ్యత కలుగజేసి నాలోని అశాంతిని తొలగించండి అని అడుగుతున్నారు. మిథ్యానేను పోతేగాని అశాంతి పోదు అంటున్నారు అందుచేత మిథ్యానేనును తొలగించుకొనే శక్తిని మీరే ఇవ్వాలి గాని కేవలము నేను సాధన చేసి పోగొట్టుకొనే శక్తి నాకు లేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నీకు భక్తి ఉంది, వివేకం ఉంది. నీ భక్తే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చింది. నేను నిన్ను ఉద్ధరిస్తాను అని భగవాన్ చెప్పటంలేదు. ఏ భక్తి అయితే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో, ఏ వివేకం అయితేనిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో ఆ భక్తే, ఆ వివేకమే నిన్ను బాగుచేస్తుంది, నీ అశాంతిని పోగొడుతుంది. ప్రత్యేకంగా నేనుచేసేది ఏమీ లేదు. నీ వివేకమే, నీ శ్రద్ధే, నీ తపనే నీ అశాంతిని పోగొడుతుంది అంటున్నారు భగవాన్. భక్తి అంటే భగవంతునితో మానసిక అనుబంధం కలిగి ఉండటం. ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. మీరు నిరంతరము భగవంతునితో అనుబంధం పెట్టుకొంటే

లేదు అనుకోండి, ఏకాగ్రత లేదు అనుకోండి దేహాన్ని అటు ఇటు త్రిప్పటం వలన ఈశ్వరుడు మోసపోడు. నీకు పవిత్రత ఏకాగ్రత ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. ఈ బంధువులు ఎవరు? స్నేహితులు ఎవరు? భార్య ఎవరు? భర్త ఎవరు? అన్నదమ్ములెవరు? అని విచారణచేస్తే ఏమీ లేదు, విచారణ చేయకపోవటం వలన ఇదంతా నిజం క్రింద కనబడుతోంది. జ్ఞానం వచ్చినప్పడు జ్ఞాని యొక్క వైభవం నీకు తెలుస్తుందిగాని అంతవరకు జ్ఞానిని దేహమాత్రుడుగా చూస్తావు. నువ్వు నిజంగా బుద్ధిమంతుడవు ఎప్పడు అవుతావు అంటే ఈ శవం నీవు కాదు అని నీకు తెలిసినప్పడు, కర్తృత్వ బుద్ధి నశించినప్పడు నీవు బుద్ధిమంతుడవు అవుతావు. కర్తృత్వబుద్ధి నశిస్తే గాని జ్ఞానం కలుగదు. జ్ఞానం కలిగితేనే గాని మోక్షం కలుగదు.

ఎవరైనా చెయ్యి ఇలాఅని మనకు విభూతి ఇచ్చారు అనుకోండి. అది చాలా గొప్ప విషయం అని మనం అనుకొంటాము. ఇదే విషయం ఒకరు భగవాన్‌తో చెపితే భగవాన్ ఏమి అన్నారు అంటే ఆ విభూతి నీకు ఇచ్చింది దొంగనేనా? నిజమైన నేనా? అని అడిగారు. ఈ ఒక్క విషయం అర్థమయితే సడన్‌గా మాయపోతుంది అంటే బాహ్య విషయాల మీద ఆకర్షణ పోతుంది. ఆ విభూతి నీకు ఎందుకు ఇచ్చినట్లు నీకు జ్ఞానానికి అది ఉపయోగపడుతుందా లేక నిన్ను ఆకర్షించుకోవటానికి ఇచ్చాడా అది ఎందుకు ఇచ్చినట్లు? గాఢనిద్రలో నీకు తలంపులు లేవు. నీ శరీరం మీద పాము పాకినా నీకు తెలియదు, నీకు భయం కలుగదు. ఎందుచేతనంటే ఈ శరీరం నాది అనే తలంపు అక్కడ లేదు. ఆ తలంపు అణిగిపోయింది అందువలన అక్కడ భయం లేదు. గాఢ నిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే నేను అనే తలంపు వస్తుంది. అది వచ్చాక మిగతా తలంపులు వస్తాయి. ఆ మొదటి తలంపుపోతే మిగతా తలంపులకు ఆశ్రయం లేదు. బాహ్య విషయాల మీద గాని, వ్యక్తుల మీదగాని ఆధారపడి నీకు సంతోషం వస్తూ ఉంటే అది ఎప్పటికైనా దుఃఖంగా మారిపోతుంది. మీకు ఆత్మజ్ఞానము కలిగితే, ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయితే ఇంతకు ముందు నీకు ఎంతదుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా కూడా సుఖంగా మారిపోతుంది. మనందరము ఏదో ఆసనాలు నేర్చుకొని దేవుడిని మోసం చేద్దామనుకొంటున్నాము. మన పద్ధతి ఎలా ఉంది అంటే మనో నాశనం అవ్వకూడదు. దేవుడు తెలియబడాలి. చమత్కారం అంతా ఇక్కడే ఉంది. మనోనాశనం అవ్వకుండా దేవుడు ఎలా తెలుస్తాడు. ఒకవేళ నీకు మనోనాశనం కాకుండా దేవుడు కనిపిస్తే నీ మనస్సు ఎంత నిజమో ఆ దేవుడు కూడా అంతేనిజం. అది వ్యవహారిక సత్యమే గాని పారమార్థిక

సత్యం కాదు. ఆసనాలవలన ఆరోగ్యం వస్తుంది. అజ్ఞానం నశిస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. అది నీకు తెలియాలి అని నీవు అనుకొంటే నీ మనస్సును కలుషితం చేసుకోకు. ఈ శరీరం శవం అయ్యేవరకు నీ మనస్సును కలుషితం చేసుకోకుండా బహుజాగ్రత్తగా జీవించు. మనకు ఏదైనా సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా, అయిష్టం వచ్చినా, ఇష్టం వచ్చినా కోరిక వచ్చినా అన్నీ మనస్సుకే కదా అని భగవాన్‌తో అంటే ఎవరి మనస్సుకు అని అడుగుతున్నారు. నా మనస్సుకు అని చెప్పాడు. నా మనస్సుకు అంటున్నావు కదా ఆ నేను ఎవరో తెలుసుకొంటే మనస్సు లేదు. మనం ఈ మిధ్యానేనును ఎక్కువగా వాడుతున్నాము. దాని వాడకం తగ్గిస్తే అది పడిపోతుంది. నేను మీతో మాట్లాడుతున్నాను అనుకోండి ఆ నేను ఇంటర్‌ఫియర్ అవ్వకుండా చూసుకోవాలి. అప్పుడు ఉపయోగపడే మాటలు వస్తాయి లేకపోతే అంతా కలుషితమే. కొంతమంది బ్రతకటమే ఆ నేను కోసం బ్రతుకుతున్నారు. దాని కోసం బ్రతుకుతుంటే అది ఎలా పోతుంది. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టాలి అంటున్నారు భగవాన్. నీవు పని చెయ్యి ఆసక్తి లేకుండా చెయ్యి. శరణాగతి చెందు. ఏదైతే జ్ఞానానుభవానికి నీకు అడ్డువస్తోందో దాన్ని ఈశ్వరుని పాదాలదగ్గర ఉంచు. ఆసక్తి లేకుండా పని ఎలా జరుగుతుంది అని అడుగుతున్నాడు. నీవు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను అంటున్నావు ఎందుకు పనిచేస్తున్నావు. జీతం కోసం పని చేస్తున్నాను అంటున్నావు. జీతం ఇస్తున్నారుకాబట్టి అక్కడ పాఠాలు చెప్పి వస్తున్నావు. అక్కడ నీకు ఆసక్తి లేదు. నీ డ్యూటీ చేస్తున్నావు. అలాగే నీవు ఇంట్లోకూడా ఉండు. నీవు కాలేజీలో ఎలా వ్యవహరిస్తున్నావో అలా ఇంట్లో కూడా ఎందుకు వ్యవహరించ కూడదు. నీవు కాలేజీలో ఎలా పనిచేస్తున్నావోఅలాగ ఇంట్లో కూడా పనిచెయ్యి నీకు ఎటాచ్‌మెంట్‌రాదు, మనస్సు కలుషితం అవ్వదు. మనస్సు కలుషితం అవ్వకుండా జీవిస్తే నీ హృదయంలో ఉన్న జ్యోతి నీకు వ్యక్తమవుతుంది. ఆసక్తి పెట్టుకొంటే మనస్సు కలుషితం అవుతుంది. ఆసక్తి లేకుండా పని చెయ్యి. నీవు ఆసక్తి పెట్టుకొన్నంత మాత్రం చేత అది జరుగదు. జరగవలసి ఉంటే నీవు ఆసక్తి పెట్టుకోకపోయినా అది జరుగుతుంది. ఆసక్తి లేకుండా పని చేస్తే పని అయిపోతుంది, నీ మనస్సు కలుషితం కాదు, నీకు చిత్త శుద్ధి కలుగుతుంది. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మోక్షానికి వెళ్ళాలి.

వాసన నశించటం అంత తేలిక కాదు. వాసనలన్నీ కలిసి స్వభావం అవుతుంది. నీ స్వభావాన్ని బట్టి నీవు పనిచేస్తున్నావు కాని దేవుడు చెప్పినట్లు నీవు చేయటం లేదు. కాని

దేవుడు చెప్పినట్లు నడుస్తున్నానని నీవు అనుకొంటున్నావు. అనుకొనేది ఒకటి, జరిగేది ఒకటి. నీకు వాసన ఎందుకు వచ్చిందంటే జన్మాంతరంలో నీవు చేసిన పనులే వాసనల క్రింద వచ్చాయి. ఆ వాసనను బట్టి నీవు పని చేస్తున్నావు. నీవు వెనక్కి తిరిగి ఆ వాసన నీలో ఎంత బలంగా ఉందో అంత బలంగా సాధన చేస్తే గాని అది నశించదు. ఇంత పెద్దపెద్ద వాసనలను మేము ఎలా పోగొట్టుకోగలము అని భగవాన్‌తో అంటే భగవాన్ ఏమి చెప్పారు అంటే నీవు ఏ వాసనతో అయితే బాధపడుతున్నావో ఆ వాసన లేనివారితో సహవాసం చేస్తే ఆ వాసన పల్చబడుతుంది. వారి వైబ్రేషన్స్ నీమీద పనిచేస్తాయి అని చెప్పారు. అప్పుడు వాలుగాలిలో సైకిలు త్రొక్కితే ఎలా ఉంటుందో నీ వాసన అంత వేగంగా క్షీణిస్తుంది. ఏదైనా ఇతరులకు చెప్పేటప్పుడు ముందు నీవు దానిని అర్థం చేసుకొని, ఆచరించి అప్పుడు ఇతరులకు చెప్పు. నీవు ఆచరించకుండా కేవలము ఇతరులకు చెప్పటమే పనిగా పెట్టుకొంటే దాని వలన వారికి పెద్ద ప్రయోజనం ఉండదు. పైగా నీవు ఈశ్వరుడి చేత శిక్షించబడతావు. మనం దేనికి విలువ ఇవ్వాలో దానికి విలువ ఇవ్వటంలేదు. దేనికి విలువ ఇవ్వకూడదో దానికి విలువ ఇస్తున్నాము. నీవు ఎంత విలువ ఇచ్చినా, ఎంత గౌరవించినా, ఎంత అలంకరించినా ఈ దేహం ఏదో రోజు శవం అవుతుంది. ఈ దేహాన్ని ముస్తాబు చేస్తే అంత ఫరవాలేదు కాని అహంభావనను ముస్తాబు చేస్తే మరీ ప్రమాదం. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అది నీకు అనుభవంలోనికి వచ్చేవరకు నిజం కాని దానిని నిజం అనుకొనే ప్రమాదం ఉంది. నీ హృదయంలోసత్యం ఉంది కాని అది లేదు అని నీవు అనుకొంటున్నావు. ఎందుచేతనంటే అంతలోతులలోనికి నీవు వెళ్ళలేకపోతున్నావు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీవు పట్టుకోవాలంటే నీకు వైరాగ్యం, అభ్యాసం అవసరం. గురువు ఎప్పుడూ నీకూడానే ఉంటాడు. నిన్ను తలుపు సందున పెట్టి నొక్కుతూ ఉంటాడు. ఎందుచేతనంటే తలుపుసందులో పెట్టి నొక్కితే గాని నీలో వాసనలు తక్కువు అది గురువు చేసే పని.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు 12-6-2000, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఏ మనిషిలో ఉన్న బలహీనత ఆ మనిషిని బాధపెడుతుంది. అందుచేత మనలో ఏ బలహీనతలు ఉన్నాయి అని ఏమనిషికి ఆ మనిషి చూసుకొని ప్రయత్నం చేసి వాటిని తొలగించుకొని మోక్షాన్ని పొందాలి. ఇది సామూహికంగా సంపాదించేది కాదు. మన

శరీరం తల్లి గర్భంలోనుండి ఎప్పుడైతే వచ్చిందో చావు కూడా అప్పుడే పుడుతుంది. కాని చావు ఏమి చేస్తుంది అంటే టైము కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అప్పటి వరకు మన శవం ఈ భూమి మీద అటుఇటు తిరుగుతూ ఉంటుంది. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాలం యొక్క విలువ తెలిసినప్పుడే మనం కాలాన్ని గౌరవిస్తాము. ధనం కంటే కాలం గొప్పది. ధనం పోతే సంపాదించుకోగలము గాని కాలము తిరిగి రాదు. కాలాన్ని గౌరవిస్తే భగవంతుడిని గౌరవించినట్లే అని చెప్పారు. ప్రాణం పోయేటైములో మనస్సును నిర్మలంగా ఉండు, నిశ్చలంగా ఉండు అంటే ఉండదు. మనం ౬౦ సంవత్సరాలు జీవిస్తాము అనుకోండి రోజూ మనస్సును ఆందోళనగా ఉంచుకొంటే చనిపోయే టైములో నువ్వు నిశ్చలంగా ఉండు అంటే అది ఉండదు. దానికోసం ఇప్పటినుండి మనం ప్రాక్టీసు చేయాలి. ఇప్పటి నుండి ప్రాక్టీసు చేస్తే మరణించే టైములో ఆ స్థితి మనకు కలుగుతుంది. నీ మనస్సుకు, ఇంద్రియాలకు సరియైన ట్రైనింగ్ ఇవ్వాలి. నీ ఆధ్యాత్మిక పురోగతికి నీ మనస్సు, ఇంద్రియములు నీకు సహకరించాలి. నీ మనస్సును, ఇంద్రియములను నియమించుకోవాలంటే నీవు ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, నిద్ర విషయంలో జాగ్రత్తగా ఉండాలి, మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ధనం వలన శాంతి రాదు, మనస్సును సమాధాన పరచుకోవటం వలన శాంతి వస్తుంది. మన ఇంద్రియాలకు అందిన విషయాలను మాత్రమే మనం చూడగలము. ఇంద్రియములకు అందని విషయాలు మనకు తెలియవు. ఆ విషయాల గురించి భగవంతుడు చెప్పినది మనం విశ్వసించాలి. మరణానంతర జీవితం ఎలా ఉంటుందో భగవంతుడు చెప్పినది మనం విశ్వసించాలి. అతీంద్రియ విషయాన్ని గురువు చెప్పినప్పుడు అది మనం ప్రమాణంగా తీసుకోవాలి. ఎవరి సమక్షంలో ఉంటే నీ మనస్సును ఏకాగ్రత కుదురుతుందో, ఎవరి సమక్షంలో నీ మనస్సు చల్లబడుతోందో, ఎవరి సమక్షంలో శాంతి తరంగాలు వచ్చి నీ బ్రెయిన్ మీద పనిచేస్తున్నాయో, ఎవరి సమక్షంలో విక్షేపదోషం తగ్గుతోందో వారిని గురువుగా స్వీకరించు అని భగవాన్ చెప్పారు. మీరు తరించడం ప్రధానం గాని ఎవరు గురువు అన్నది ప్రధానం కాదు.

ఈ ప్రపంచం నిజమా, నిజం కాదా అని ఒకరు గాంధీ గారిని అడిగారు. నిజం, నిజం కాదు అని రెండూ చెప్పారు. నీకు స్వప్నం జరుగుతోంది అనుకో. స్వప్నం జరుగుతున్నప్పుడు స్వప్నంలో వచ్చే విషయం నిజం అనుకొంటావు. జాగ్రదవస్థలోనికి వచ్చాక ఆ విషయం నిజం కాదు అని నీకు తెలుస్తుంది. స్వప్నంలో ఉన్నప్పుడు ఆ విషయం

పురుషుడినిగాని మనం ధ్యానంచేయాలి. సత్యవస్తువు, మరణంలేనివస్తువు మన హృదయంలో ఎక్కడో లోతులలో ఉంది. అంతలోతులలోనికి వెళ్ళటానికి ఇప్పుడు మనకు ఉన్న అభ్యాసం, వైరాగ్యం చాలదు. అభ్యాసం, వైరాగ్యం పెంచుకోవాలి. మనకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనంతినే తిండివిషయంలో, చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం మాట్లాడేమాటలకు మనం బాధ్యత వహించాలి లేకపోతే నోరుమూసుకొని కూర్చోవాలి. మనం భక్తిలో అభివృద్ధిలోనికి రావాలంటే మనం మాట్లాడే మాటల విషయంలో, చేసే పనుల విషయంలో బాధ్యతగా ఉండాలి. కొంతమంది గాలిమాటలు మాట్లాడతారు వారికి ఏమీ బాధ్యత ఉండదు. అలా ప్రవర్తించకూడదు. భగవంతుడు మన ఉపాధి ద్వారా ఏపని అయితే మనకు అర్పించాడో అది బాధ్యతగా చేస్తే మనకు ప్రారబ్ధం నశిస్తుంది, వస్తువు ఎరుకలోనికి వస్తుంది. ఇప్పుడు మన శరీరం మనకు ఎలా ఎరుకలో ఉందో అలా లోపల ఉన్న సద్వస్తువు అంత డైరెక్టుగా మనకు ఎరుకలోనికి వస్తుంది.

మనం పనిదొంగలుగా ఉండకూడదు. ఈ శరీరం చనిపోయేవరకు అనేక అనుభవాలు వస్తాయి. పొందవలసిన అనుభవాలు పొందేవరకు, తినవలసిన మెుట్టికాయలు తినేవరకు మనకు చావురాదు. ఈలోపు కంగారుపడి చావువస్తే బాగుండును అనుకొన్నా చావురాదు. అందరిచేత మాటలు అనిపించుకొంటే గాని మనకు బుద్ధిరాదు. మనకు అనేకరకాల అనుభవాలు కలుగుతాయి. అన్ని అనుభవాలను సమానంగా తీసుకోవాలి. ఆ అనుభవాలనుండి పాఠాలు నేర్చుకొంటే మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది, జ్ఞానం కలుగుతుందిగాని పాండిత్యం వలన జ్ఞానం రాదు. ఇప్పుడు మనం దేహంగా జీవిస్తున్నాము, మనస్సుగా జీవిస్తున్నాము. అనుభవాలనుండి పాఠాలు నేర్చుకొంటే చైతన్యంగా జీవించేశక్తి మనకు కలుగుతుంది. భగవంతుడు ఒకోసారి కష్టాలను పంపుతాడు అవి మనకు వరాలు అనే సంగతి మనకు తెలియటంలేదు. మన చైతన్యస్థాయిని పెంచటంకోసం ఆ కష్టాలను పంపుతాడు. అందువలన ఇతరులను విమర్శించకుండా మీ ప్రారబ్ధాన్ని మీరే విమర్శించుకొని అందులోనుండి పాఠాలు నేర్చుకోవాలి. అలా పాఠాలు నేర్చుకొంటే వివేకం పెరుగుతుంది, వైరాగ్యం పెరుగుతుంది, హృదయంలో భగవంతుడు ఎంతలోతులలో ఉన్నాడో అంతలోతులలోనికి వెళ్ళటానికి మనకు శక్తి కలుగుతుంది. ఈ పంచభూతాలను ఎవడైతే నియమిస్తున్నాడో వాడే ఈ జీవుడిని కూడా నియమిస్తున్నాడు. ఈ లోకానికి యజమానికూడా ఆయనే. ఆయనకు శరణాగతి పొందితే ప్రారబ్ధం నిన్ను ఏమీ చేయలేదు. ప్రారబ్ధం అనుభవించటానికి

గాని, భక్తియోగం ద్వారాగాని లేక అన్ని యోగాలను సమన్వయం చేసుకొని గాని ఏదోరకంగా ప్రయాణించి మిథ్యానేనును ఉపసంహరించాలి. యోగబలం లేకపోతే మిథ్యానేను హృదయంలో నిలబడదు. హృదయంలో నిలబడితే గాని అది నశించదు. స్వార్థం లేకుండా ఇతరులకు ఉపయోగపడే పని చేసినా మిథ్యానేను పల్చబడుతుంది. మీ దగ్గర 10 రూపాయలు ఉన్నాయి అనుకోండి. అవసరమయిన వారికోసం అందులో ఒక్క రూపాయి మీరు ఉపయోగించినా దానివలన కూడా ఈ మిథ్యానేను పల్చబడుతుంది. నిరంతరం నామాన్ని జపించటం వలన కూడా మిథ్యానేను ఉపసంహరింపబడుతుంది. కొంతసేపు ధ్యానం చేయవచ్చు, కొంతసేపు విచారణ చేయవచ్చు అవకాశం ఉన్నప్పుడు స్వార్థం లేకుండా కొంతపని చేయాలి. ఇలా చేయటం వలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మిథ్యానేనును ఉపసంహరించి దాని మూలంలో ఉంచగలిగితే అది నశిస్తుంది అప్పుడు అక్కడ ఉన్న సద్వస్తువు, ఆత్మ నీకు తెలియబడుతుంది. ఒక వాక్యాన్ని చదివేటప్పుడు దానిని సీరియస్‌గా తీసుకొని, ఆ వాక్యాన్ని అర్థం చేసుకొని దానిని మననం చేస్తే దాని హృదయం మనకు తెలుస్తుంది. నీవు ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే అది నీకే తిరిగి వస్తుందని నీకు అర్థమయితే ఇతరులకు సహాయం చేయకుండా నీవు ఎలా ఉండగలవు. ఇది రోజూ మనం చదువుతాము కాని ఆ వాక్యానికి ఇచ్చే విలువ మనం ఇవ్వము ఇంక అది మనకు ఎలా తెలుస్తుంది.

గాలికి వ్యక్తి భావన ఉండదు, నీటికి వ్యక్తి భావన ఉండదు. అలా మనం ఉంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది. పంచభూతాలకు ఎక్కడా వ్యక్తిభావన లేదు. అలా వ్యక్తిభావన లేకుండా మనం ఉండగలిగితే జ్ఞానం దగ్గరకు మనం వెళ్ళనక్కరలేదు అదే మన దగ్గరకు వస్తుంది. నీ దుఃఖానికి కారణం, అశాంతికి కారణం, బేదబుద్ధికి కారణం వ్యక్తి భావనే. మన దైనందిన జీవితంలో భగవాన్ టీచింగ్‌ను ఇన్‌వాల్వు చేయాలి, కలుపుకోవాలి. పూజగదికి పరిమితం చేయకూడదు. మన దైనందిన జీవితంలో ఆయన టీచింగ్‌ను ఇన్‌వాల్వు చేసుకొంటే ఆటోమెటిక్‌గా మనం చేసేపని చేసుకొంటూనే ఆత్మస్థితిని పొందవచ్చును. మనం ఏమి చేస్తున్నాము అంటే దైనందిన జీవితాన్ని సెపరేట్ చేస్తున్నాము. సాధన అంతా పూజగదికి పరిమితం చేస్తున్నాము. నీవు చేసే పనిలో వ్యక్తి భావన లేకుండా చెయ్యి నీకు జ్ఞానం కలుగుతుంది. మనకు వస్తువు అనుభవంలోనికి రాకపోవటానికి మన అలవాట్ల యొక్క వేగం కారణం అని భగవాన్ చెప్పారు. నీ అలవాట్ల యొక్క వేగం

తగ్గితే , నీకు వ్యక్తి భావన తగ్గితే బ్రహ్మం తనంతట తానుగా నీకు వ్యక్త మవుతుంది. నీ హృదయంలోసద్వస్తువు ఉంది. అది తెలుసుకోవటానికి నువ్వు పెద్ద కష్టపడనక్కరలేదు. అది చాలా చిన్న విషయం. తలంపుల వేగం తగ్గితే, అలవాట్ల యొక్క వేగం తగ్గితే, ఆ వస్తువు నీకు స్ఫురిస్తుంది. ముందు నీకు ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకో. ఆ బలహీనతలనుండి బయట పడటానికి ప్రయత్నం చెయ్యి. నీ బలహీనతలే దేహాభిమానాన్ని పెంచుతున్నాయి. వాటిని తీసి ఒక ప్రక్కన పెడితే వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. గాఢనిద్రలో నీకు ఏ గొడవ లేదు. మెలుకవరాగానే దేహంతో తాదాప్యం పొందుతున్నావు. దేహంతో తాదాప్యం వలననే నీకు ఆత్మ తెలియటం లేదు. దేహంతో తాదాప్యం విడిపోయిన మరుక్షణంలో నీకు ఆత్మలబ్ది కలుగుతుంది. కొంతమంది 4 గంటలు ధ్యానం చేసాము, 5 గంటలు జపం చేసాము అని చెపుతారు. ఎవరైనా చిన్న మాట అంటే భరించలేరు. 4 గంటలు సాధన చేసి చిన్న అవమానం భరించలేకపోతే ఇంక నీ మనస్సులోపలకు ఏమి వెడుతుంది. నిన్ను ఎవరైనా అగౌరవపరిస్తే నీ ఫీలింగ్ హార్ట్ అయ్యింది అనుకో నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. చిన్న కష్టాన్ని భరించలేనప్పడు నీకు సాధన ఏమిటి? మనం పుస్తకాలు చదివిన దానికంటే ఒకోసారి జీవితంలో వచ్చే బాధలు మనకు ఎక్కువ టీచ్ చేస్తాయి. బాహ్యంగా ఏదో చేయటం వలన జ్ఞానం రాదు. ఈశ్వరానుగ్రహనికి పాత్రులవ్వాలి. దైనందిన జీవితంలో మన బిహేవియర్ ఇంటిలిజెంట్‌గా ఉండాలి, ఈగోలెస్ బిహేవియర్ ఉండాలి. అలా ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఆయన అనుగ్రహానికి పాత్రులయితే ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు, అనుభవాన్ని ఆయనే మనకు ఇస్తాడు. మనకు ఇంటిలిజెంట్ బిహేవియర్ లేదు, ఈగోలెస్ బిహేవియర్ లేదు ఏదో జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము అంటే అది ప్రదర్శన కోసమా?

సాధన పేరుమీద నీవు ఎక్కడికి పారిపోవద్దు. ఎక్కడికి వెళ్ళినా మిధ్యానేను నీకూడా ఉంటుంది. ఈ మిధ్యానేనును నీవు పరిష్కరించుకోవాలి. దీనిని పరిష్కరించుకోవటానికి ఈ రోజు ప్రయత్నం చేయకపోతే రేపు చేస్తావని నిర్ధారణ ఎక్కడ ఉంది. నీకు అన్ని అవకాశములు ఉన్నప్పడే దీనిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయకపోతే నీకు అవకాశములు లేనప్పడు ఎలా తొలగించుకొంటావు. నీ అస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసేది ఈ మిధ్యానేనే. నీ సాధనలో మిధ్యానేనును ఇన్‌వాల్వు చెయ్యి, అప్పడు అది నశిస్తుంది. మనకు జీవితంలో సంతోషం కలిగించే అనుభవాలు, బాధను

కలిగించేఅనుభవాలు రెండూ వస్తూ ఉంటాయి. మనం అప్పుడు ఒకరకంగా, ఇప్పుడు ఒక రకంగా ఉంటాము. రెండింటిలోను సమానంగా ఉండము. దీనివలన మిథ్యానేను బలపడిపోతుంది. రెండింటియందు సమానంగా ఉంటే మిథ్యానేనుకు ఫుడ్ సప్లయి కట్ అయిపోయి దాని అంతట అదే హృదయగుహలోనికి జారిపోతుంది. నాకు శాంతి కావాలి, సుఖం కావాలి అంటున్నావు. నీవు కావాలంటే అది వచ్చేది కాదు. నీవు నేచురల్ స్టేట్‌లో లేనప్పుడు నీకు శాంతి కావాలన్నా అది రాదు. ఆ స్థితిని పొందాలని ఏ వయస్సులో మనకు కలిగినా ఆ వయస్సునుండి మనం ప్రయత్నం ప్రారంభించాలి. ప్రయత్నం మటుకు శ్రద్ధగా చేయాలి, భక్తితో చేయాలి. దేహం చనిపోవాలంటే దానికి 40 రోజులు ఫుడ్ పెట్టకుండా ఉంటే అది చనిపోతుంది. అంటే దేహానికి వెళ్ళే ఫుడ్‌ను కట్ చేస్తే ఆ దేహం నశిస్తుంది. మూలతలంపుకు విషయ చింతనే ఆహారం. మూలతలంపుకు విషయ చింతన లేకుండాచేస్తే దాని అంతట అదే నశిస్తుంది. మూలతలంపును డెకరేట్ చేస్తే అది బలపడుతుంది. అది బలపడేకొలది మన స్వరూపమునకు దూరమవుతాము.

నేను అనే తలంపు ఎక్కడి నుండి పుడుతోందో చూడు. అలా చూడగా చూడగా లోచూపు వస్తుంది. రాగద్వేషాలు తగ్గించుకొంటే లోచూపు వస్తుంది. రాగద్వేషములు తగ్గించుకోకపోతే మనస్సు బాహ్యాముఖమవుతుంది. మనస్సు బాహ్యాముఖానికి వెళుతూ ఉంటే మనోమూలం ఎలా తెలుస్తుంది. ఆత్మ సాక్షాత్కారం పొందాలి అనే తపన లోపలనుండి రావాలి. సత్పురుషులతో సహవాసం చేస్తే ఆ తపన వస్తుంది. మొదటి తలంపును ఇది ఎవరు, ఎక్కడ నుండి వచ్చింది అని విచారణ చేయగా చేయగా అది ఉపసంహరింపబడుతుంది. నీవు దానిని విచారణ చేయవు, ఎందుచేతనంటే అదే నువ్వు అనుకొంటున్నావు. ఆత్మ దేహము లేకుండా ఉండగలదు, లోకం లేకుండా ఉండగలదు. మిథ్యానేను దేహం లేకుండా ఉండలేదు, లోకం లేకుండా ఉండలేదు. మిథ్యానేను దేహం లేకుండా ఉండలేదు కాబట్టి దానికి పునర్జన్మ వస్తుంది. మీకు సంతోషం వచ్చినా మిథ్యానేను పెరుగుతుంది, దుఃఖంవచ్చినా మిథ్యానేను పెరుగుతుంది. అందుచేత అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని మన తలంపులను, మన ఆలోచనలను మన ఇష్ట దేవత చుట్టూ త్రిప్పుతూ ఉంటే ఈ మిథ్యానేను నశిస్తుంది. నిరంతరము ఇష్ట దేవతను స్మరించటం వలన దానికి వెళ్ళే ఫుడ్ సప్లయి కట్ అయిపోయి మిథ్యానేను నశిస్తుంది.

వారికి జ్ఞానం వచ్చిందా, వీరికి జ్ఞానం వచ్చిందా అని అడిగే బదులు మనకు జ్ఞానం వచ్చిందా అని మనం చూసుకోవాలి. నేను అనే తలంపు వచ్చాక నువ్వు వచ్చావు, వాడు

వచ్చాడు గాఢ నిద్రలో నీకు నేను అనే తలంపు లేదు, అది లేకపోతే ఏదీ లేదు. హృదయ గుహలో ఉన్న సుఖం, శాంతి విజృంభించి వచ్చి నీ శిరస్సును ముంచుతున్నప్పుడు దేవుడు ఉన్నాడా లేడా, లోకం ఉందా లేదా, పునర్జన్మ ఉందా లేదా అనే సందేహాలు రావు. ఒకవేళ దేవుడు వచ్చి కనబడినా మనకు చూడాలని ఉండదు అట్టిది నీ హృదయంలో ఉన్న శాంతి. మేఘాలు సూర్యుడు మనకు కనబడకుండా చేయగలవు గాని ఈ మేఘాలు సూర్యుడిని తాకలేవు. అదే విధంగా నీ హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు నీకు కనబడకుండా నీ తలంపులు, నీ ఆలోచనలు, నీ వాసనలు, నీ అలవాట్లు అడ్డు వస్తున్నాయి గాని ఈ విషయాలు జ్ఞాన సూర్యుడిని తాకటంలేదు. ఇవి అంతలోతులలోనికి వెళ్లలేవు గాని నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రాకుండా అడ్డువస్తున్నాయి. వీటిని తీసి ఒక ప్రక్కన పెట్టగలిగితే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్త మవుతుంది.

గురువును ఆశ్రయించు, గురువు చెప్పినది శ్రవణం చెయ్యి, మననం చెయ్యి గురువు యందు గౌరవం ఉంటే ఆయన చెప్పిన మాటయందు గౌరవం ఉంటుంది. కేవలము గురువును ఆరాధించి ఆయన పాదాలను ధ్యానం చేసి మోక్షమును పొందిన వారు ఉన్నారు. ఏ మార్గంలో ప్రయాణం చేసినా అహంవృత్తిలో నుండి బయటకు రావాలి. ఎవరిలో మంచి ఉన్నా అది మనం నేర్చుకోవాలి. ఎవరిని చూసి అసూయ పడకూడదు. వారిలో ఉన్న మంచి మనం నేర్చుకోవాలి. ఏ వస్తువుకైతే మరణం లేదో ఆ వస్తువును పొందిన వాడిని జ్ఞాని అంటారు. మనం బ్రతికి ఉండగా చనిపోయిన వారితో సమానము. జ్ఞాని శరీరం పోయిన వారు పనిచేస్తున్నారు. మనకు శాంతిని కలుగజేస్తున్నారు. మనం శరీరం ఉండగా కూడా ఏమీ చేయలేకపోతున్నాము ఎందుచేతనంటే జ్ఞానం లేకపోవటం వలన. కృష్ణుడు శరీరం ఇప్పుడు లేదు అంటే కృష్ణుడు లేడు అనుకోవద్దు కృష్ణుడిని స్మరించి అనేక మంది జ్ఞానం పొందుతున్నారు కదా లేడుఅని ఎలా చెపుతాము. మీకు ఇష్టమైన దేవుడితో గాని, గురువుతో గాని మానసికఅనుబంధం పెట్టుకోండి. శరీరం ఎక్కడ ఉన్నా ఫరవాలేదు. గురువుతో మానసికఅనుబంధం వలన ఇంజను వెనకాల పెట్టెలు ఎలా వెళతాయో అలాగ గురువు మనలను గమ్యానికి తీసుకొని వెళతాడు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు శాంతిగా ఉండగలిగితే మీకు శక్తి కలుగుతుంది. మీ శక్తి మీకు ఉపయోగపడుతుంది, సమాజానికి కూడా ఉపయోగపడుతుంది. మీరు హృదయపూర్వకంగా ఇతరులక్షేమం కోరుతున్నారు అనుకోండి ఆ తలంపుకూడా మీ ఆధ్యాత్మిక పురోగతికి ఉపయోగపడుతుంది. మనకు పట్టుదల ఉండాలి, సహనం ఉండాలి. సహనం ఉన్నవాడికి తూకం పెరుగుతుంది. సహనం

ఉన్నవాడు హృదయగుహలోనికి ప్రవేశించగలడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు 18-6-2000, ఆకివీడు

ప్రియమైన అత్మ బంధువుల్లారా,

మనము ఆలోచన విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం బాగుపడాలంటే పోజిటివ్ తింకింగ్ ఉండాలి. నెగిటివ్ తింకింగ్ వలన మనం చెడిపోతాము. మనం ఈజన్మలో ఈరకంగా ఉన్నామంటే పూర్వజన్మలలో ఏదోవిషయాలు ఆలోచించి ఈరకంగా తయారయ్యాము. ఇప్పడు మన ఆలోచనలు, తలంపులు భవిష్యత్ జన్మలను నిర్ణయిస్తాయి. అందువలన మనం సామాజికస్పృహ కలిగి ఉండి ఎవరిలో ఏమంచి ఉంటే ఆమంచిని మనం గ్రహిస్తే మనం బాగుపడతాము. అన్ని విషయాలు మనకు తెలియవు. మనకు తెలియని విషయాలు చెప్పటానికే శాస్త్రం. అన్నీ నాకు తెలుసును అనుకొనేవాడికి ఆధ్యాత్మిక పురోగతి ఉండదు. మనకు తెలియని విషయాలను నేర్చుకోవటానికి పయత్నం చేయాలి. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని మీ జీవితాన్ని తీర్చి దిద్దుకోండి అని భగవంతుడు చెపుతున్నాడు. ఇది అంతా వాసుదేవమయమే, ఇది అంతా ఆత్మ స్వరూపమే అని ఆయన చెపుతున్నా అది మనకు అనుభవంలో లేదు. అది మనకు అనుభవంలో లేదు కాబట్టి ఆయన చెప్పినది అసత్యం అని కాదు బహుజన్మల కృషి వలనగాని ఇది అంతా వాసుదేవమయం అన్న సంగతి మనకు తెలియదు. బహుజన్మల కృషి ఎందుకంటే మన మనస్సులో ఉన్న దోషాలను, బలహీనతలను తొలగించుకోవటానికి బహుజన్మలు పడతాయి. ఎప్పడైతే నీ మనస్సులో ఉన్న దోషాలు నశించినాయో, ఎప్పడైతే నీకు ఆర్ద్రత కలిగిందో పరమేశ్వరుడు ఒక్క క్షణం కూడా ఆగడు, నీకు తెలియబడతాడు. అందుచేత ఈశ్వరుని యందు భక్తి ఉండాలి, ఈశ్వరస్మరణ ఉండాలి. మీకు ఇష్టమైన దైవాన్నిగాని, గురువునుగాని నిరంతరం స్మరించటం వలన యాంత్రికంగా కాదు, ఇష్టంగా ప్రేమగా స్మరించటం వలన నీ మనస్సులో ఉన్న దోషములు నశిస్తాయి. గాంధీగారికి నిరంతరం రామనామమే. అది ఒక్కటే చాలు అని ఆయన చెప్పారు. నిరంతరం జపించుటవలన నీవు పవిత్రుడవు అవుతావు. ప్రాణం పోయేటప్పడు కూడా ఆయన హేరామ్ అని హృదయ పూర్వకంగా స్మరించారు. ఆయన చిన్నతనం నుండి ఆ నామం ప్రాక్టీసు చేయటం వలన మరణ సమయంలో రామనామమే ఆయనకు స్ఫురించింది. ఏదైతే మనం జీవితం పొడుగునా స్మరిస్తామో, దేనికోసమైతే జీవిస్తామో అది మరణసమయంలో జ్ఞాపకం వస్తుంది. దానిని బట్టి పునర్జన్మ నిర్ణయించబడుతుంది.

సత్యవస్తువు అత్యంత సమీపంలో మన హృదయంలోనే ఉన్నప్పటికీ అది మనకు గోచరించటం లేదు. అది మన లోపల ఉండటమే కాదు, అది మనమై ఉన్నాము కాని అది మనకు గోచరించటం లేదు. ఇదీ విచిత్రం. కానిదానిని ఇది మనమే, ఇది మనమే అని అనుకోవటం వలన సత్యవస్తువు మనకు గోచరించటం లేదు. నీవు కానిదానిలోనుండి విడిపోయేవరకు అది నీకు గోచరించదు. నువ్వు సాధన చెయ్యి లోపలఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. మనం అధ్యయనం చేయుటకంటే చెప్పేవారు ఉంటే శ్రవణం చేయుట మంచిది. ఎందుచేతనంటే వారి అనుభవాన్ని జోడించిచెపుతారు. అప్పుడు ఎక్కువ కష్టం లేకుండా సబ్జెక్టు మనం నేర్చుకోవచ్చు. సత్పురుషుల సహవాసం వలన మనోవికారములు తొందరగా నశిస్తాయి. లోకంలో అందరి క్షేమం కోరుచున్నాము అనుకోండి, ఎవరిని చూసి అసూయ పడమనుకోండి, ఎవరికీ దుఃఖం రాకూడదు అందరూ శాంతిగా ఉండాలి అన్న తలంపు హృదయపూర్వకంగా మనకు వస్తోంది అనుకోండి దానివలన కూడా నీకు పరమేశ్వరుడు ఆధ్యాత్మికంగా అభివృద్ధిని కలుగజేస్తాడు. మనకు ఎవరైనా అపకారం చేసారనుకోండి తిరిగి మనం వారికి అపకారం చేస్తే మనం భక్తులం ఎలా అవుతాము. భక్తుడు భగవంతుని మాటను ప్రమాణంగా తీసుకోవాలి గాని లోకాన్ని ప్రమాణంగా తీసుకోకూడదు. మనం సహనాన్ని, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్నిపెంచుకోవాలి. మనం ఏ మార్గంలో నడుస్తున్నామో ఆ మార్గంలో తప్పడ, తప్పడ అడుగులు వేయకూడదు. నెమ్మదిగా, స్టెడీగా నడుస్తూ వెళ్ళాలి. మనం వేసే అడుగుల మీద మనకు నమ్మకం ఉండాలి. మనం నడిచే మార్గంనందు పూర్ణమైన విశ్వాసం ఉంటే మనకు తప్పని సరిగా మోక్షం కలుగుతుంది. నీకు మోక్ష స్థితి కలిగితే ఈ శరీరం గొడవగాని, ప్రపంచం గొడవగాని ఏమీ ఉండదు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే అప్పుడు నీకు రాకపోకలతో పనిలేదు. గాంధీగారు ఒకమాట చెప్పారు. నేను జాగ్రదవస్థలో బాగానే ఉంటున్నాను కాని ఎక్కడో హృదయాంతరాలలో తలవెంట్రుక వాసంత బలహీనతలు నా లోపల ఉన్నాయి. జాగ్రదవస్థలో అవినాకు కనిపించటంలేదు. స్వప్నంలో నాకు కనిపిస్తున్నాయి. స్వప్నంలో ఎందుకు చూపిస్తున్నాడు అంటే ఈ బలహీనతలు నీకు ఉన్నాయి సుమా అని నాకు తెలియజేయటం కోసం, జాగ్రదవస్థలో సాధన చేసి వాటిని తొలగించుకోమని చెప్పకుండా చెప్పటంకోసం ఈశ్వరుడి ప్రణాళిక అది. నీ బలహీనతలను తొలగించుకొనే ప్రయత్నంలో నీవు పడిపోతూ ఉంటావు. మరల ప్రయత్నం చేయాలి. రిపీటెడ్‌గా నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఏదో ఒకరోజున అందులోనుండి బయటపడతావు. మనకు జీవితంలో

అప్పుడప్పుడు శాంతి వస్తూ ఉంటుంది. అది టెంపరరీగా వస్తుంది, మరల పోతుంది. దానిని మనం పెర్మనెంట్ చేసుకోవాలి. అది పర్మనెంట్ అవ్వాలంటే వాసనలు పూర్తిగా నశించాలి. ఈ సృష్టిలో దేనిని చూసి మనం గర్వపడకూడదు. దేనినైనా చూసి గర్వపడుతూ ఉంటే అది మన అజ్ఞానానికి, మన భ్రాంతికి గుర్తు.

రామకృష్ణుడు దగ్గరకు ఒక భక్తుడు వచ్చినాకు ఈ నెలలో మోక్షం వస్తుందా, ఎప్పుడు వస్తుంది అని అడిగాడు. శవాన్ని ఎప్పుడైనా చూసావా అని రామకృష్ణుడు అడిగాడు, చూసాను అని చెప్పాడు. శవానికి ఏమైనా వికారములు ఉంటాయా అని అడిగాడు, ఏమీ ఉండవు అని చెప్పాడు. శవం ఎంత నిర్వికారంగా ఉందో అలా నీవు ఉండగలిగితే ఆస్థితి నీకు వస్తే ఇప్పుడే నీకు మోక్షానుభవం కలుగుతుంది అని చెప్పాడు. నిజమైన నేను దేనితోనూ తాదాప్యం పొందదు. అన్నింటితోటి తాదాప్యం పొందేది దొంగ నేనే. అదే నువ్వు అనుకొంటున్నావు అందువలన అందులో నుండి విడిపోవటానికి ప్రయత్నం చేయటం లేదు. నువ్వుదారి తప్పిపోయావు, ఇప్పటికే చాలా దూరం వెళ్ళిపోయావు. దారి తప్పిన నిన్ను రక్షించి సరియైన మార్గంలో నడిపించే వాడే గురువు. భక్తిని పూజగదికి పరిమితం చేయకూడదు. దైనందిన జీవితంలో భక్తిని ప్రాక్టీసు చేస్తూ ఈ దొంగ నేనును తగ్గించుకొంటూ రావాలి. ఒక ప్రక్క భగవంతుడిని చింతిస్తూ ఉండాలి రెండో ప్రక్కన ఏ వాసన అయితే నిన్ను బాహ్యాముఖం చేస్తోందో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయాలి. పూర్వజన్మ సంస్కారమును బట్టి తలంపులు వస్తూఉంటాయి. నీవు నిరంతరము భగవంతుని స్మరణలో ఉన్నప్పుడు తలంపులు వచ్చినప్పటికీ ఆ తలంపులకు ఫుడ్ సప్లయిలేక అవి నెమ్మదిగా వాడిపోయి రాలిపోతాయి. ఇప్పుడు నీకు నేను అనేటప్పటికి దేహము స్ఫురిస్తోంది కదా దీనికి సాధన అక్కరలేదు. అలాగే నేను అనేటప్పటికి నీకు లోపల ఉన్న బ్రహ్మం స్ఫురించేవరకూ ఏదో మార్గంలో మీరు ప్రయాణం చేయవలసిందే, గత్యంతరం లేదు. వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకూ ఏదో ఒక ప్రయత్నం చేస్తూ ఉండవలసిందే, తప్పదు. నువ్వు నిర్మలంగా ఉండు, నిశ్చలంగా ఉండు, నిదానంగా ఉండు. నువ్వు బాగుపడే విధానం చూసుకో, వారు మంచివారు, వారు చెడ్డవారు అని జడ్జిమెంట్ చెప్పకు. నీ మనస్సులో ప్రకోపం రాకుండా చూసుకో. నీ మనస్సు ఆరోజుకు ఆరోజు ఆత్మవైపుకు హృదయంలోనికి ఉపసంహరింపబడుతూ ఉండాలి. అప్పుడు మూలంలోనికి వెళతావు. మనస్సు విజృంభిస్తూ ఉంటే వాడికి జ్ఞానం కలుగదు. మనస్సు ఉపసంహరింపబడుతూ ఉంటే వాడికి జ్ఞానం కలుగుతుంది.

ప్రారంభ దశలో ధ్యానం మీకు కష్టంగా ఉంటుంది. కష్టంగా ఉందని దానిని

విడిచిపెట్టవద్దు. కొంతకాలానికి నేచురల్‌గా, నార్మల్‌గా మీరు చేయగల్గుతారు. మీరుకాని శరీరం తోటి, ఇంద్రియాలతోటి, విషయాలతోటి, అహంకారంతోటి, ప్రపంచంతోటి అన్నింటితో కలిసిపోయి వాటితో కాపరం పెట్టుకొని నోటితో నేను బ్రహ్మమును, నేను ఆత్మను అంటే ఏమి కలిసివస్తుంది. జీవితంలో చివరకు మిగిలేది సున్న. మీ బలహీనతలను పేస్‌చేసి వీటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. ధ్యానం చేస్తూ ఉంటే నీకు పురోగతి కలుగుతుంది. నీకు యోగ్యత ఉంటే మధ్య మధ్యన ఈ ధ్యానం చేసేవాడు ఎవడు అని ప్రశ్న వేస్తూ ఉండు. ధ్యానం చేసేది ఈ దొంగనేనే, వాడిని తీసేస్తే ధ్యానం చేసేవాడు ఉండడు. ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ దొంగనేనును తీసి ఒక ప్రక్కన పెట్టాలి. మనం నడుస్తూ ఉంటే ముళ్ళ కంప అడ్డువస్తే తీసి ప్రక్కన పెడతాము అలాగే మీకు ఆధ్యాత్మిక పురోగతి కావాలంటే నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా అహంకారం అనే ముళ్ళకంపను తీసి ప్రక్కనపెట్టాలి, లేకపోతే ఎంతదూరం నడిచినా మీకాళ్ళకు అది తగులుతూంటుంది. నీ హృదయంలో సత్యవస్తువు ఉంది. అది నీకు కనబడకుండా అహంకారం అనే మూతపైన ఉంది. నీవు సాధన చేసి ఆ మూతను తీసి ఒక ప్రక్కన పెట్టగలిగితే సత్యవస్తువు నీకు గోచరిస్తుంది. నీవు ఆ మూతను తీసి ప్రక్కన పెట్టలేవు ఎందుచేతనంటే ఆమూతే నువ్వు అనుకొంటున్నావు. కనుక దానిని విడిచిపెట్టేది లేదు, సత్యవస్తువు దొరికేది లేదు. ఏదో మహాత్ముల అనుగ్రహం వలన దానిని తీసి ప్రక్కన పెట్టగలవుగాని కేవలం నీ తెలివితేటల వలన దానిని ప్రక్కన పెట్టలేవు. నీ ప్రయత్నం ఒక్కటే సరిపోదు. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం ఉండాలి. దైనందిన జీవితంలో దేహాభిమానం తగ్గించుకోవాలి. మీ ప్రక్కవాళ్ళు మీకు తాడు బొంగరం లేదు అంటారు అనుకోండి దానివలన మీకు దుఃఖం వస్తుంది. అదే అజ్ఞానం. అలా అంటే మీకు నష్టం ఏమిటి? మనస్సు యొక్క మూలంలో చైతన్యం, శాంతి నీకు తెలియకపోయినా మనస్సు తెలుస్తోంది కదా. ఆ మనస్సును విచారణ చేస్తే ఈ మనస్సు ఎవరు, నన్ను ఇలా పీడిస్తోంది అని విచారణ చేస్తే అది పోతుంది. కాని మనం విచారణ చేయము. ఎందుచేతనంటే మనం దేవుని భక్తులం కాదు, ఈ సైతానుకు భక్తులం. మనస్సును దాని మూలంలో స్థిరంగా ఉంచి, దానిని నాశనం చేయగల్గితే మిగిలేది ఆత్మ, మిగిలేది చైతన్యం, మిగిలేది శాంతి. అది సూటి మార్గం.

నాకు అజ్ఞానం పోలేదు అన్నాడు ఒక భక్తుడు. ఎవరికి అజ్ఞానం అన్నారు భగవాన్. నాకు అన్నాడు ఆ నేనును తీసివేస్తే అజ్ఞానం ఎక్కడ ఉంది అన్నారు. నువ్వుంటే అజ్ఞానం ఉంది, నువ్వు లేకపోతే అజ్ఞానం లేదు అన్నారు. నేను వేరు, అజ్ఞానం వేరు అనుకొంటున్నావు

అజ్ఞానం నేను రూపంలో ఉంది. దానిని తీసివేస్తే ఏమీ లేదు. గాఢనిద్రలో పరిమితులు లేవు. అక్కడ అఖండంగా ఉన్నాడు. జాగ్రదవస్థలో వచ్చేటప్పటికి పరిమితులు వచ్చేస్తున్నాయి. దీనికి మనస్సే కారణం. మనస్సు నశిస్తే గాఢనిద్రలో ఉన్న స్థితి జాగ్రదవస్థలో వచ్చేస్తుంది. అదే మోక్షం. వేదాంతం నేర్చుకోవటం చాలా తేలిక, ఇతరులకు చెప్పటం అంతకంటే తేలిక, దాన్ని జీవించటం చాలా కష్టం. ఎలాగ అంటే వేదాంతం ఎంత నేర్చుకున్నా వాడికి ఏదైనా రోగం వస్తే మరణం వస్తుంది అనిచెపితే మరణంలోనుండి ఎలా తప్పించుకోవాలి అను చూస్తాడు ఎందుకంటే వాడికి లోపల అనుభవం లేదు. చావు వస్తే రానియ్యి, ఈ దేహం భూమి మీద ఎంతకాలం ఉండాలో అంతకాలం ఉంటుంది, తరువాత పోతుంది, అది దేహప్రారబ్ధం అని వాడు అనుకోడు. మరణం నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. ఇలా మరణం నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేయటం వేదాంతి లక్షణం కాదు. ఇది గుర్తు పెట్టుకొని వేదాంతం చెప్ప అని చిన్మయానందకు వారి గురువుగారు చెప్పారు.

మనం భగవంతుని చింతించటం మానివేస్తే మన మనస్సు వెంటనే విషయాలను చింతిస్తుంది. విషయాలను చింతించేకొలది అహంకారం పెరిగిపోతుంది. విషయాల మీదకు మనస్సు వెళ్ళకుండా కాపుదల కోసమే నిరంతరం ఈశ్వరస్మరణ. నీవు నిరంతరం ఈశ్వరుని స్మరిస్తూ ఉంటే ఇంక మనస్సుకు విషయాలను స్మరించటానికి టైములేదు అప్పుడు నేచురల్‌గానే దానికి చావువస్తుంది. మీరు జీవితంలో ఎంతోకొంత శాంతి అనుభవించారు. అది ఇప్పుడు లేదు. ఒక గంటలో ఉండి, ఇంకో గంటలో పోయే శాంతిని కాదు మనం పట్టుకోవలసింది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఏ శాంతిని సంపాదిస్తే అది చెదరకుండా ఉంటుందో దానిని మనం పట్టుకోవాలి, దానికి వైరాగ్యం ఉండాలి. సాధ్యమైనంత వరకు చలనం లేకుండా చూసుకో. ఆత్మనిష్ఠలో నుండి జారిపోకుండా చూసుకో. ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆటంకం కలిగించే తలంపులు వస్తున్నాయి అనుకో వాటిని నెమ్మదిగా తొలగించుకొనే ప్రయత్నం చెయ్యి. నీ సంపాదనలో రూపాయికి 5 పైసలు తీసి సమాజానికి ఉపయోగపడే ఖర్చు చెయ్యి అది కూడా సాధనలో ఒక భాగమే. దాని వలన నీవు పవిత్రుడవు అవుతావు. ఈ చిన్న విషయం కూడా నీ ఏకాగ్రతకు, పవిత్రతకు, మోక్షానుభవానికి నీకు సహకారం చేస్తుంది.

అరుణాచల శివ   అరుణాచల శివ   అరుణాచల శివ   అరుణాచలా